రాణాకు మోక్షమెపుడో?

- సత్యనారాయణపురంలో ఏళ్లుగా సాగుతోన్న నిర్మాణం
- తాత్కాలిక స్టేషన్ సరిపోక సిబ్బంది ఇబ్బంది
- మహిళా సిబ్బంది అవస్థలు చెప్పనలవికావు


నిర్మాణంలో ఉన్న సత్యనారాయణపురం పోలీసు స్టేషన్ నూతన భవనం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ పరిధిలోని సత్యనారాయణపురం పోలీసుస్టేషన్ నూతన భవన నిర్మాణం ఏళ్లతరబడి సాగుతూనే ఉంది. 2018లో అప్పటి ప్రభుత్వంలో స్టేషన్ నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. 2019లో పనులు ప్రారంభించారు. ఇక అప్పటి నుంచి నిర్మాణం నత్తనడకన సాగుతోంది. ఇప్పటికైనా పోలీస్ స్టేషన్ భవనానికి మోక్షం లభిస్తుందా అన్న సందేహం కలుగుతోంది. భవనం పూర్తి కాకపోవడంతో తాత్కాలిక స్టేషన్‌లో సిబ్బంది ఇబ్బంది పడాల్సి వస్తోంది. సత్యనారాయణ పురం పోలీసు స్టేషన్ ఏలూరు కాలువ ఒడ్డున ఉంది. కొన్ని దశాబ్దాల క్రితం నిర్మించింది కావడం.. ప్రస్తుత అవసరాలకు సరిపోకపోవడంతో నూతన భవనం నిర్మించాలని నిర్ణయించారు. మూడు అంతస్తుల భవన నిర్మాణానికి రూ.2.75 కోట్ల నిధులు మంజూరయ్యాయి. గ్రౌండ్ ఫ్లోర్ పార్కింగ్, మొదటి అంతస్తులో కాన్ఫరెన్స్ హాలు, లాకప్ రూమ్స్, రెండో ఫ్లోర్‌లో ఎస్ఐలు, మూడో ఫ్లోర్‌లో మహిళా సిబ్బంది రెస్ట్ రూమ్స్ ఉండేలా భవనానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. 2018లో అప్పటి ప్రభుత్వంలో భవన నిర్మాణానికి శంకుస్థాపన జరిగింది. ఇక అప్పటి నుంచి నిర్మాణ పనులు కొనసాగుతూనే ఉన్నాయి. మూడు అంతస్తులు శ్లాబు వేసి వదిలేశారు. నిధుల కొరత, పలు రకాల కారణాలతో నిర్మాణాలు నిలిచిపోయాయి.

ఏలూరు లాకుల వద్ద గెస్ట్ హౌస్‌లో స్టేషన్

కొత్త భవనం నిర్మించేందుకు పాత పోలీసు స్టేషన్ భవనం కూల్చివేశారు. స్టేషన్‌ను తాత్కాలికంగా ఏలూరు లాకుల వద్ద ఉన్న పోలీస్ గెస్ట్‌హౌస్ పక్కన భవనంలోకి మార్చివేశారు. ఇక్కడ ఒక హాలు, రెండు గదులు మాత్రమే ఉన్నాయి. స్టేషన్ పరిధిలో గాంధీనగర్, రైల్వే స్టేషన్, సత్యనారాయణపురం మూడు సెక్టార్లు ఉన్నాయి. స్టేషన్ హౌస్ ఆఫీసర్‌తో పాటు ఒక్కో సెక్టార్‌కు ఒకరు చొప్పున ముగ్గురు ఎస్ఐలు, ఒక క్రైం ఎస్ఐ, 50 మంది సిబ్బంది అంతా ఈ ఇరుకు భవనంలోనే విధులు నిర్వర్తించాల్సిన పరిస్థితి. నూతన భవన నిర్మాణం ఆలస్యం అవుతూ వస్తుండడంతో ఆరేళ్లకు పైబడి ఈ ఇరుకు గదుల్లోనే పోలీసు స్టేషన్ నడుస్తోంది. ఇక్కడ సౌకర్యాలు లేక సిబ్బంది అవస్థలు పడుతున్నారు. స్టేషన్‌కు వచ్చే వారు సైతం రోడ్డు మీద, మధ్యలో డివైడర్ పైనో కూర్చోవలసిన పరిస్థితి. వివిధ కేసుల్లో పట్టుకువచ్చిన వాహనాలు నిలిపేందుకు కూడా సరిపడా స్థలం లేదు. ఇక మహిళా సిబ్బంది బాధలు చెప్పనలవికాదు. ఆరేళ్లుగా పిల్లర్లపై కేవలం శ్లాబులు వేసి ఉంచారు. ప్రస్తుతం నూతన భవనం పనులు తిరిగి ప్రారంభమయ్యాయి. విద్యుద్దీకరణ పనులు, సీలింగ్ పనులు పూర్తి చేసి, టైల్స్ ఏర్పాటు చేస్తున్నారు.

డిసెంబర్ నాటికి పూర్తి చేస్తాం

2019లోనే పనులు ప్రారంభమయ్యాయి. చాలా కాలంగా నిర్మాణ పనులు నిలిచిపోయిన మాట వాస్తవమే. ఇటీవలే ఎమ్మెల్యే పనులను పరిశీలించారు. డిసెంబర్ నాటికి నిర్మాణం పూర్తి చేసి అప్పగిస్తాం.

–జి శ్రీనివాసరావు, డీఈ

24న విజయవాడలో ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విశ్వవిఖ్యాత నట సార్వభౌమ నందమూరి తారక రామారావు సినీ వజ్రోత్సవం ఈ నెల 24వ తేదీన విజయవాడలో నిర్వహించనున్నట్లు ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవ కమిటీ చైర్మన్ తొండెపు దశరథ జనార్దన్ తెలిపారు. నగరంలోని తెలుగు ఫిలిం చాంబర్ హాల్లో గురువారం ఫిలిం ఇండస్ట్రీ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వజ్రోత్సవ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు సలహాలు, సూచనలు చేయాలని కోరారు. కార్యక్రమానికి భారతదేశంలోని పలు భాషలకు చెందిన ప్రముఖ నట దిగ్గజాలు హాజరవుతారన్నారు. విజయవాడలో ఎన్టీఆర్ స్మారక ఉద్యానవనాన్ని ఏర్పాటు చేసేందుకు తెలుగు ఫిలిం ఇండస్ట్రీ ముఖ్య నాయకులతో పాటు సీఎం చంద్రబాబు నాయుడు కూడా ఆసక్తి కనబరుస్తున్నారన్నారు. సినీ ఇండస్ట్రీ ఎదుర్కొంటున్న అన్ని సమస్యలు పరిష్కరించేందుకు చంద్రబాబు సానుకూలంగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో పాలేపు రామారావు, నవరంగ్ థియేటర్ అధినేత భూపాల్ ప్రసాద్, ఊర్వశి థియేటర్ అధినేత విశ్వనాథ్, ముత్తవరపు శ్రీనివాసబాబు, రాంగోపాల్ రామచంద్రరావు, శక్తి పిక్చర్ రమేష్, తెలుగు ఫిలిం చాంబర్ సహ కార్యదర్శి శివ, విశ్వేశ్వరరావు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మస్క్యులర్ డిస్ట్రోఫీ బాధితులకు బ్యాటరీ వీల్ చైర్స్ అందజేత



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఏలూరురోడ్డులోని ఐకాన్ పబ్లిక్ స్కూల్‌లో గురువారం అమరావతి రేర్ డిసీజెస్ ఆర్గనైజేషన్(ఏఆర్డీఓ) ఆధ్వర్యంలో మస్క్యులర్ డిస్ట్రోఫీ వ్యాధి బాధితులకు ఎలక్ట్రికల్ బ్యాటరీ వీల్ చైర్స్ అందజేశారు. ఒక్కొక్కటి రూ.50వేల విలువ చేసే నాలుగు వీల్ చైర్స్‌ను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న సంస్థ ఫౌండర్ సుంకర శోభారాణి మాట్లాడుతూ మస్క్యులర్ డిస్ట్రోఫీ వ్యాధి అనేది మెడిసిన్ లేని జెనెటికల్ డిసీజ్ అని, బాధితులు నాలుగు గోడల మధ్య నుంచి బయటకు వచ్చి సంతోషంగా గడపటం కోసం ఎలక్ట్రికల్ బ్యాటరీ వీల్ చైర్స్ ఎంతో ఉపయోగపడతాయన్నారు. సంస్థ చేసే కార్యక్రమాలకు సహకరిస్తున్న ఐకాన్ స్కూల్ యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు. రంగిశెట్టి ఫౌండేషన్ ప్రెసిడెంట్ రంగిశెట్టి రమేష్ బాబు మాట్లాడుతూ భవిష్యత్‌లో బాధితులకు తమ వంతు సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఐకాన్ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ కొండిశెట్టి రాజేంద్ర, యడ్ల పార్థసారథి, ముల్పూరి సుందర్ రాజ్ కుమార్, తోట కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సంతోష్ ఫుట్‌బాల్ ట్రోఫీకి ఆంధ్రా జట్టు సిద్ధం



విజయవాడస్పోర్ట్స్: అనంతపురంలో ఈ నెల 15 నుంచి ప్రారంభమయ్యే సంతోష్ దక్షిణ భారత ఫుట్‌బాల్ ట్రోఫీకి రాష్ట్ర జట్టును సిద్ధం చేసినట్లు ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ అసోసియేషన్(ఏపీఎఫ్ఏ) అధ్యక్షుడు కోటగిరి శ్రీధర్ తెలిపారు. గత నెలలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో అత్యుత్తమ క్రీడా నైపుణ్యం ప్రదర్శించిన క్రీడాకారులతో జట్టును ఏర్పాటు చేశామన్నారు. ఈ జట్టుకు సీనియర్ కోచ్‌లు ఈశ్వర్, శ్యామ్‌లతో 20 రోజుల పాటు అనంతపురంలో కోచింగ్ క్యాంప్ నిర్వహించామన్నారు. ఈనెల 19వ తేదీ వరకు జరిగే ఈ ట్రోఫీలో తమిళనాడు, అండమాన్ నికోబార్, కర్ణాటక జట్లతో రాష్ట్ర జట్టు తలపడుతుందన్నారు. జట్టుకు ఎంపికైన క్రీడాకారులను ఎన్టీఆర్ జిల్లా ఫుట్‌బాల్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వై.శేషగిరిరావు, చక్రవర్తి, కోనసీమ సంఘం ప్రతినిధి నీలాద్రి గురువారం అభినందించారు.

మహాధర్నా జయప్రదం చేయండి

కృష్ణలంక(విజయవాడతూర్పు):విద్యారంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న విద్యాదీవెన, వసతిదీవెన బకాయిలు బడ్జెట్‌లో కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 18వ తేదీ ధర్నాచౌక్‌లో జరిగే మహాధర్నా జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె.ప్రసన్నకుమార్, ఎ.అశోక్ పిలుపునిచ్చారు. రాఘవయ్య పార్కు సమీపంలోని బాలోత్సవ భవన్‌లో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో మహాధర్నాకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. విద్యాదీవెన, వసతిదీవన బకాయిలు రూ.3,480 కోట్ల విడుదలకు ప్రభుత్వం తాత్సర్యం చేస్తుందన్నారు. ఇప్పటికే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పలుమార్లు విన్నవించిన ప్రభుత్వం జాప్యం చేస్తూ కల్లబొల్లి మాటాలు చెబుతుందని వాపోయారు. అసెంబ్లీ సమావేశాల్లో బడ్జెట్ కేటాయింపులలో పెండింగ్ బకాయిల గురించి మాట్లాడకపోవడం హేయమైనచర్య అని అన్నారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి సిహెచ్. వెంకటేశ్వరరావు, నాయకులు ప్రణీత, షణ్ముఖ్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్కేటింగ్ చాంప్‌లో బెజవాడ రోలర్స్ సత్తా



విజయవాడస్పోర్ట్స్: కాకినాడ, విశాఖపట్నంలో ఈ నెల ఆరు నుంచి 12వ తేదీ వరకు జరిగిన రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీల్లో బెజవాడ రోలర్ స్పోర్ట్స్ అసోసియేషన్ క్రీడాకారులు సత్తా చాటారు. ఈ పోటీలకు ప్రాతినిధ్యం వహించిన విజయవాడ క్రీడాకారులు విజయ్‌డానియల్(రెండు బంగారు, ఒక కాంస్యం), రఫియా(రజితం), మహీధర్(కాంస్యం), కోటేశ్వర్(మూడు బంగారు), శాన్విరఫియా(రెండు రజితం, ఒక కాంస్యం), ఆశ్రిత(కాంస్యం), ప్రణవరెడ్డి(రజితం), నరేన్(కాంస్యం), లెహస్య(కాంస్యం), లోకేష్ కుమార్(రెండు రజితం, రెండు కాంస్యం), సుచిత్ర(రజితం), ఓజేష్ వర్ధన్(రజతం), అభిరామ్(రజతం), నైనిక(బంగారు, రజతం), రాకేష్(కాంస్యం) పతకాలు సొంతం చేసుకున్నారు. పతకాలు సాధించిన క్రీడాకారులను స్కేటింగ్ రాష్ట్ర సంఘం ప్రతినిధులు టి.భగీరథకుమార్, థామస్ చౌదరి, శ్రీనివాస్‌రెడ్డి, మురళీకృష్ణ, కోచ్‌లు వరుణ్‌కృష్ణ, దిలీప్ అభినందించారు.

చాచా నెహ్రూ ఆశయ సాధనకు కృషి చేయాలి

- వాకర్స్ క్లబ్ జిల్లా గవర్నర్ డాక్టర్ చిన్నం రామకృష్ణ
- పలు పాఠశాలల్లో ఘనంగా బాలల దినోత్సవం


నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వాకర్స్ జిల్లా గవర్నర్ డాక్టర్ చిన్నం రామకృష్ణ


ముత్యాలంపాడు గొట్టిముక్కల సూర్యనారాయణరాజు ఉన్నత పాఠశాలలో బహుమతుల ప్రదానం

మధురానగర్(విజయవాడసెంట్రల్): చాచా నెహ్రూ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వాకర్స్ క్లబ్ జిల్లా గవర్నర్ డాక్టర్ చిన్నం రామకృష్ణ సూచించారు. బీఆర్‌టీఎస్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యాన బుధవారం భారతదేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతి వేడుకలు నగరపాలకసంస్థ పాఠశాలలో జరిగాయి. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని డెప్యూటీ గవర్నర్ డాక్టర్ బ్రహ్మదేశం వసంతకుమార్‌తో కలిసి జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు విద్యా సామగ్రి, పుస్తకాలు, బిస్కెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సీహెచ్ఎస్ఎస్ పద్మలత, క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ముత్యాలంపాడులో...

ముత్యాలంపాడు గొట్టుముక్కల సూర్యనారాయణరాజు నగరపాలకసంస్థ ప్రాథమిక పాఠశాలలో బాలల దినోత్సవం పురస్కరించుకుని జయహో వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యాన విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జయహో వాకర్స్‌క్లబ్ అధ్యక్షురాలు కొల్లా జయశ్రీ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పరశురాం తదితరులు పాల్గొన్నారు.

మారుతీనగర్‌లో...

మారుతీనగర్ నారాయణ పాఠశాలలో బుధవారం బాలల దినోత్సవం ఉత్సాహంగా జరిగాయి. చిన్నారులు, నెహ్రూ, సిపాయి, ఆర్మీ తదితర వేషధారణలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ఎస్‌పీఎఫ్ పోలీస్ అధికారి గణపతి, ఏజీఎం విజయ బాలల దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం నిర్వహించిన పోటీలలో విజేతలకు బహుమతి ప్రదానం చేశారు.

విద్యార్థులకు బహుమతులు పంపిణీ

ముత్యాలంపాడు గొట్టిముక్కల సూర్యనారాయణరాజు నగరపాలకసంస్థ ఉన్నత పాఠశాలలో బాలల దినోత్సవం పురస్కరించుకుని పాఠశాల విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. విద్యార్థులకు పాఠశాల సిబ్బంది సొంత ఖర్చుతో భోజనాలు ఏర్పాటు చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జి.పుష్పలత పాల్గొన్నారు.

సెయింట్ జాన్స్‌లో బాలల దినోత్సవం

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): స్థానిక సత్యనారాయణపురంలోని సెయింట్ జాన్స్ స్కూల్‌లో గురువారం బాలల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో పలు ఆటల పోటీలు, వక్తృత్వ, వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న విశ్రాంత ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం మోహన్ విద్యార్థులతో కలసి జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పోటీలలో విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ టి.దీపిక, ప్రెసిడెంట్ టి.మోనిక, కరస్పాండెంట్ సుమన్ త్యాగరాజన్, ప్రిన్సిపాల్ కె.పావన దీప్తి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వాస్తవ పరిస్థితులకు అద్దం పట్టిన నాటికలు


అనుకున్నదొకటి ఐనదొకటి నాటికలోని సన్నివేశం

విజయవాడకల్చరల్: భారతదేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతి, బాలల దినోత్సవం సందర్భంగా సుంకర టి.కృష్ణ మెమోరియల్, నాగార్జున కళాపరిషత్ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో గురువారం ప్రదర్శించిన సాంఘిక నాటికలు వాస్తవ పరిస్థితులకు అద్దం పట్టాయి. మనిషి సంఘజీవి అని, సమాజ శ్రేయస్సులో అతని పాత్ర విస్మరించలేనిదని, అతడు బాధ్యతగా ఉన్నప్పుడే సమాజం శ్రేయస్కరంగా వుంటుందనే సందేశంతో అనుకున్నది ఒకటి ఐనదొకటి నాటిక సాగుతుంది. రచన గోపీ వల్లభ, దర్శకత్వం వాసు. రెండవ ప్రదర్శనగా స్నూపీ నాటికను ప్రదర్శించారు. ఈ నాటికలో విజ్ఞత కలిగిన వ్యక్తి తన స్వార్థం కోసం అనేక దారుణాలు చేస్తుంటాడని, విజ్ఞత లేని శునకం మాత్రమే యజమాని కోసం తన ప్రాణాలను సైతం త్యాగం చేయగలదని చెప్పారు. రచన కరీముల్లా దర్శకత్వం వాసు. నాగార్జునా కళాపరిషత్ వ్యవస్థాపకుడు దేవినేని కిషోర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

నేడు జ్వాలాతోరణం

కార్తిక పౌర్ణమి వేడుకలకు ముస్తాబైన దేవాలయాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): కార్తిక మాసంలో కార్తిక పౌర్ణమి వేడుకలకు నియోజకవర్గంలోని శివాలయాలన్నీ అందంగా ముస్తాబయ్యాయి. అయోధ్యనగర్‌లోని శ్రీదత్త సాయి శివకామేశ్వరీ పీఠం, ముత్యాలంపాడులోని శ్రీ పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామివారి దేవాలయంలో కార్తిక పౌర్ణమి పురస్కరించుకుని స్వామివారికి విశేషంగా మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, బిల్వార్చనలు ఏర్పాటు చేశారు. శుక్రవారం సాయంత్రం ఆలయం వద్ద జ్వాలాతోరణం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మధురానగర్‌లోని శ్రీ ఉభయ రామలింగేశ్వర స్వామివారి దేవాలయం, సత్యనారాయణపురం శివకేశవ దేవాలయంలో కూడా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ఇష్టారాజ్యంగా ఆక్రమణలు

చోద్యం చూస్తున్న అధికారులు


ముత్యాలంపాడులో నిర్మిస్తున్న స్క్రాప్ దుకాణం


వీవీ నరసరాజు రోడ్డులో పూర్తికాని ఫెన్సింగ్

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ వీవీ నరసరాజు రోడ్డు ఆక్రమణలకు నిలయంగా మారింది. ఇక్కడ ఏలూరు కాలువ పక్కన ఇరిగేషన్ స్థలంపై కబ్జాదారుల కన్నుపడింది. ఇటీవల ఆలయాల పేరిట ఆక్రమణలకు పాల్పడ్డారు.ఇక్కడ స్క్రాప్ వ్యాపారులు ఈ ప్రాంతాన్ని ఆక్రమించి వ్యాపారాలు సాగిస్తున్నారు. దీనిపై సాక్షి కథనాల మేరకు స్పందించిన అధికారులు కమిషనర్ ఆదేశాల మేరకు ఆక్రమణలు తొలగించి ఫెన్సింగ్ పనులు ప్రారంభించారు. కానీ ఫెన్సింగ్ పనులు పూర్తికాకుండానే స్క్రాప్‌వ్యాపారులు మరోమారు కొద్దికొద్దిగా ఆక్రమించి వ్యాపారాలు సాగిస్తున్నారు. రోడ్డుపైనే స్క్రాప్ వ్యాపారులు చెత్తచెదారం వేసి పనులు చేస్తున్నారు. దీంతో విశాలమైన ఈ మార్గంలో కనీసం రాకపోకలు సాగించేందుకు సైతం ఇబ్బందులు పడాల్సిన దుస్థితి ఏర్పడిందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

నత్తనడకన ఫెన్సింగ్ పనులు

ఇక్కడ ఆక్రమణల నేపథ్యంలో నగరపాలకసంస్థ కమిషనర్ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి ఆక్రమణలు జరగకుండా శాశ్వత చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కమిషనర్ ఆదేశానుసారం ఆక్రమణలను తొలగించిన అధికారులు ఫెన్సింగ్ పనులు కూడా ప్రారంభించారు. అయితే ఫెన్సింగ్ పనులు నత్తనడకన సాగుతున్నాయి. అధికారులు కావాలనే పనులు జాప్యం చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలి

ఏలూరు కాలువ పక్కన ఇరిగేషన్ స్థలంలో మొక్కలు నాటి సుందరంగా తీర్చిదిద్దటంతో పాటు వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. గతంలో ఇక్కడ వాకింగ్ ట్రాక్ కోసం నిధులు మంజూరు చేయగా పనులు కూడా జరిగాయి. అయితే ఇంతలో ఇక్కడ ఆక్రమణల నేపథ్యంలో వాకింగ్ ట్రాక్ జాడ కనిపించకుండా పోయింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలి.

ప్రభుత్వ ముద్రణాలయం సమీపంలో నిర్మాణాలు...

ముత్యాలంపాడు ప్రభుత్వ ముద్రణాలయం సమీపంలోని వంతెన వద్ద ఇరిగేషన్ స్థలంలో స్క్రాప్ వ్యాపారి దుకాణం నిర్మాణం చేస్తున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే తమకు అన్ని అనుమతులు ఉన్నాయని, తమను ప్లానింగ్ సెక్రటరీ నిర్మించుకోమని చెప్పారని చెబుతున్నారు. ఇక్కడకు అత్యంత సమీపంలో రామాలయం, శివాలయం ఉన్నాయి. నిత్యం వేలాది మంది రాకపోకలు సాగించే ఈ మార్గంలో స్క్రాప్ దుకాణం నిర్మించటం వల్ల పరిసరాలు అపరిశుభ్రంగా మారి భక్తులు ఇబ్బందులు పడే అవకాశం ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలు


పుస్తకాలను తిలకిస్తున్న అతిథులు


గ్రంథాలయ వారోత్సవాలలో పాల్గొన్న ఎమ్మెల్యే ఉమా, కార్పొరేటర్ శర్వాణిమూర్తి


ఎస్ఆర్ఆర్ కళాశాలలో పుస్తక ప్రదర్శనను తిలకిస్తున్న అతిథులు, వైస్ ప్రిన్సిపాల్ శైలజ


గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు

విజయవాడకల్చరల్: గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలు అని ప్రపంచ రచయితల సంఘం గౌరవ అధ్యక్షుడు, అవనిగడ్డ శాసన సభ్యుడు మండలి బుద్ధప్రసాద్ అన్నారు. విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో వారం రోజులపాటు నిర్వహించే 52వ గ్రంథాలయ వారోత్సవాలు, పుస్తక ప్రదర్శనను గురువారం సొసైటీ కార్యాలయంలో ఆయన ప్రారంభించారు. రచయిత్రి వాడ్రేవు వీరలక్ష్మీదేవి మాట్లాడుతూ గ్రంథాలయాలు తన సాహిత్య జీవితాన్ని ప్రభావితం చేశాయని వివరించారు. విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ వ్యవస్థాపకుడు వెంకటనారాయణ,గోళ్ళ నారాయణరావు, కార్యవర్గ సభ్యులు బెల్లపు బాబ్జీ, లక్ష్మయ్య పాల్గొన్నారు. పుస్తక ప్రదర్శనలో సాహిత్యం, చరిత్ర, బాల సాహిత్యం, కెరియర్ గైడెన్స్, నవలలు, కథా సాహిత్యం, అనువాద గ్రంథాలను అందుబాటులో ఉంచారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): విద్యార్థులు చిన్నతనం నుంచే గ్రంథాలయాలను ఉపయోగించుకోవడం అలవాటుగా మార్చుకోవాలని సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బొండా ఉమా అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా గురువారం సత్యనారాయణపురంలోని చిత్తరంజన్ గ్రంథాలయంలో స్థానిక కార్పొరేటర్ శర్వాణిమూర్తితో కలసి జ్యోతి ప్రజ్వలన చేసి వారోత్సవాలను ప్రారంభించారు. అనంతరం జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో శారదా జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ లుక్కా శ్రీధర్, ఏకేటీపీ స్కూల్ హెచ్ఎం శ్రీనివాసులు, రిటైర్డ్ లెక్చరర్ బి.సావిత్రి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ఆర్‌లో గ్రంథాలయ వారోత్సవాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శైలజ అధ్యక్షతన గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం అయ్యాయి. కార్యక్రమంలో విశ్రాంత గ్రంథపాలకుడు ఉప్పాల సాంబయ్య ముఖ్య అతిథిగా పాల్గొని గ్రంథాలయాల ప్రాధాన్యత, పుస్తక పఠనం వల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు. విశ్రాంత గణిత అధ్యాపకుడు డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు గణితంలో చిట్కాలను వివరించారు. అనంతరం పుస్తక ప్రదర్శన నిర్వహించారు.

ఠాగూర్ గ్రంథాలయంలో...

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రభుత్వ విప్, సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ హెచ్ఎం ధ్యానచంద్ర జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలు ప్రారంభించారు. తొలుత అయ్యంకి వెంకట రమణయ్య, రవీంద్రనాద్ ఠాగూర్, జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. వేడుకల్లో కార్పొరేటర్ నెలిబండ్ల బాలస్వామి, గ్రంథాలయ కార్యదర్శి రవికుమార్, సాహితీవేత్త జీవీ పూర్ణచంద్, గ్రంథాలయ అధికారి కె.రమాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

ఐటీసీఎల్ బంక్‌లో...

బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఐటీసీఎల్ పైలట్ బంక్‌లో చిన్నారులకు నోట్ బుక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీలర్లు సత్యనారాయణ, నందకిషోర్, మేనేజర్ వెంకటప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

చింతచిగురు రుచే వేరప్పా!


చింతచిగురు చూడంగానే ఈ సీజన్‌లో ఎవరికైనా ఒక్కసారి తెచ్చుకుని చింతచిగురు పప్పు వండుకోవాలని అనిపించక మానదు. షడ్రుచులలో ఒకటైన ఆ పులుపును కూడా చవి చూడాలని ఉవ్విళ్లూరక మానరు. మనుషులకే కాదు వానరాలు, కొండముచ్చులకు సైతం


చింతచిగురు నోరూరిస్తుందని ఈ చిత్రమే చెబుతోంది. విజయవాడ గాంధీనగర్‌లోని గోరా పార్క్‌లోచింత చెట్టు చిటారు కొమ్మలపైకి ఎక్కి ఓ కొండముచ్చు ఎంచక్కా చింత చిగురుని తింటున్న దృశ్యాన్ని 'సాక్షి' కెమెరాలో బంధించింది.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

ఖలీలుల్లా మృతి మైనార్టీలకు తీరని లోటు



లబ్బీపేట(విజయవాడతూర్పు): ముస్లిం, మైనార్టీల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేసిన న్యాయవాది మొహమ్మద్ ఖలీలుల్లా ఆకస్మిక మృతి మైనార్టీ వర్గాలకు తీరని లోటు అని ముస్లిం అడ్వకేట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జవహర్ అలీ అన్నారు. ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన ముస్లిం అడ్వకేట్స్ అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి మొహమ్మద్ ఖలీలుల్లా సంతాప సభ, దువా కార్యక్రమం గురువారం లబ్బీపేటలోని దర్సగాహ్ ఇ ఇస్లామీ హైస్కూల్ ప్రాంగణంలో జరిగింది. ముస్లిం డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు మైనార్టీ ప్రముఖులు పాల్గొన్నారు. ముస్లిం జేఏసీ కన్వీనర్ షేక్ మునీర్ అహ్మద్ మాట్లాడుతూ మైనార్టీల సమస్యలపై ఏ కార్యక్రమం చేపట్టినా ఖలీల్ ముందుండే వారన్నారు. ఆయన ఆకస్మిక మృతి చాలా బాధాకరమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ వైద్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ మెహబూబ్‌షేక్, సొసైటీ అధ్యక్ష కార్యదర్శులు మక్బూల్ నదీ, ముఖ్తార్ అలీ తదితరులు పాల్గొన్నారు.